# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 9 జూలై 2024 | KAMAREDDY




నిజామాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు


నాలుగు నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నవీపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన పంచాయతీ కారోబార్లు, పారిశుద్ధ్య సిబ్బంది, వాటర్‌మన్లు

# నిరసనల హోరు

ఎన్నికల్లో ప్రకటించిన జీవనభృతి, బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని, కార్మికుల పొట్టకొట్టే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ, అంగన్‌వాడీ, బీడీ కార్మికులు, వ్యవసాయ కూలీలు సోమవారం ఆందోళన చేపట్టారు. పెండింగ్ వేతనాల కోసం నవీపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా చేశారు.

# కదంతొక్కిన బీడీ కార్మికులు

**రూ.4వేల జీవనభృతి అమలు చేయాలని డిమాండ్**

ఖలీల్‌వాడి, జూలై 8: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా రూ.4వేల జీవనభృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, కార్మికులకు ఉపాధి కల్పించడం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవనభృతి ఇచ్చి ఆదుకోవాలన్నారు. బీడీ పరిశ్రమను దెబ్బ తీసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రకరకాల చర్యలు చేపట్టిందని ఆరోపించారు. సిగరెట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందని ఆయన దుయ్యబట్టారు. కేంద్రం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేయడం సాధ్యం కాదని అసెంబ్లీలో తీర్మానం చేయించాలని సీఎంను కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సూర్యశివాజీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల పాపయ్య, బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ భూమేశ్వర్, భూమన్న దాసు, యూనియన్ నాయకులు శివకుమార్, గంగాధర్, పద్మ, సుప్రియ, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం.10ని ఉపసంహరించుకొని, పాత జీవోను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్‌లో అంగన్‌వాడీ ఉద్యోగులు, కార్మికుల ధర్నా


సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.12వేల జీవనభృతి అందజేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వ్యవసాయ కూలీలు

# తాగుడే.. తాగుడు

- పాలు, నీళ్లతో సమానంగా వినియోగం
- భేషుగ్గా బెల్టు షాపులు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన మద్యం వ్యాపారం
- ఏడు నెలల్లో రూ.వెయ్యి కోట్ల అమ్మకాలు
- బెల్ట్‌షాపులపై నియంత్రణ లేక విచ్చలవిడిగా దందా



## ఏరులై పారుతున్న మద్యం

నిజామాబాద్, జూలై 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) / మాక్లూర్: భార్యా ఇద్దరు పిల్లలతో సంసారాన్ని వెళ్లదీస్తున్న సురేశ్‌ది(పేరుమార్చాం) దిగువ మధ్యతరగతి సాధారణ కుటుంబం. అతనిది నెలకు రూ.20వేలు సంపాదించే ప్రైవేటు ఉద్యోగం. మద్యానికి బానిసకావడంతో నిత్యం రూ.100 నుంచి రూ.150 వరకు ఖర్చు చేస్తున్నాడు. నెలకు సరాసరి మద్యంపై పెడుతున్న వ్యయం రూ.3వేలు మించుతున్నది. అదే భార్యాపిల్లల అవసరాలకు రోజుకు అరలీటర్ నుంచి లీటర్ వరకు పాలను ఇంటికి తీసుకొస్తున్నాడు. లీటర్ పాలకు రూ.80 చొప్పున నెలకు సగటున రూ.2వేల వరకు వెచ్చిస్తున్నాడు. ఇలా ఒక సాధారణ కుటుంబంలో మద్యానికి బానిసైన ఇంటి పెద్దతో జరుగుతున్న నష్టం చాలా ఉంటున్నది. భారీగా సంపాదించే కుటుంబాల్లోనూ ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగానే ఉంటుంది. మొత్తానికి మద్య నియంత్రణ లేమితో సాధారణ, మధ్యతరగతి కుటుంబాలే చితికిపోతున్నాయి. గతేడాది డిసెంబర్ నుంచి జూన్ ముగింపు వరకు ఉమ్మడి జిల్లాలో 10.11లక్షల బీర్ కేసులు, 17.96 లక్షల విస్కీ కేసులు అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.1053కోట్లుగా ఉండడం విశేషం.

### కల్పిత కొరత.. కుటుంబాల్లో కల్లోలం..

మద్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందుతున్నది. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో మద్యం అమ్మకాలను పరిశీలిస్తే నియంత్రణ అన్నది మచ్చుకూ లేకుండా పోయిందని తెలుస్తున్నది. గణనీయమైన మద్యం అమ్మకాలు పెరుగుతుండడంతో ప్రభుత్వానికి లాభదాయకంగా మారింది. ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు పాలు, నీళ్లతో సమానంగా మారిందన్న వాదన వినిపిస్తున్నది. మద్యం విక్రయాల పెరుగుదల ప్రభావం సర్కారుకు కాసులు కురిపిస్తుండగా మరోవైపు సామన్య కుటుంబాల ఎదుగుదల, పొదుపు చర్యలను తగ్గిస్తున్నది. మద్యం విచ్చలవిడితనంతో మైకంలో పలువురు క్షణికావేశంలో నేరాలకు పాల్పడుతున్న ఘటనలు సైతం పెరుగుతున్నాయి. తమ వ్యాపారాలు మూడు పువ్వులు... ఆరుకాయలు అన్న చందంగా మార్చుకునేందుకు మద్యం దుకాణాల యాజమాన్యాలు అంతా కలిసి ఓ ప్రణాళికను అమలు చేస్తున్నారు. దీనికి స్థానిక పోలీసులు సైతం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లుగా సమాచారం. తెర వెనుక ఆబ్కారీ శాఖ అధికారులు వంత పాడుతుండడంతో ఈ తంతు సాఫీగా సాగుతున్నది. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం దుకాణాల్లో బాటిళ్ల కొరత అన్నదే ఎప్పుడూ కనిపించదు. నిజామాబాద్ జిల్లాలో ఈ మధ్య కాలంలోనే తరచూ మద్యం కొరత ఎదురవుతుండడం విడ్డూరంగా మారుతున్నది. కొన్ని డిమాండ్ ఉన్న బాటిళ్లను బెల్టు దుకాణాలకు సరఫరా చేసి రెట్టింపు వసూళ్లకు పాల్పడుతున్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే విక్రయించాల్సి ఉంటున్నందున కుటిల ఆలోచనతో మద్యం వ్యాపారులు ఈ ఎత్తుగడకు పాల్పడుతున్నారు. లైసెన్స్ పొందిన వైన్స్ షాపుల్లో దొరకని మద్యం బాటిళ్లు యథేచ్ఛగా బెల్టు షాపుల్లో పగలు,రాత్రి తేడా లేకుండా లభిస్తుండడమే ఇందుకు ఉదాహరణ.

**సంసారాల్లో చిచ్చురేపుతున్న మద్యం..**

మద్యం అక్రమ అమ్మకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతున్నది. మద్యం దుకాణాల్లో కాకుండా విచ్చలవిడిగా సాగుతున్న క్రయ, విక్రయాలతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు గుప్పుమంటున్నాయి. మద్యం దుకాణాల సంఖ్య మండలానికి ఒకటి నుంచి రెండు వరకు విస్తరిస్తే... బెల్టు దుకాణాలు మాత్రం అందుకు రెట్టింపు స్థాయిలో పాకిపోయాయి. గ్రామాల్లో కొన్నేండ్లుగా మద్యం వ్యాపారంలో ఆరితేరిన వారు... ఇందులో ప్రధానపాత్రను పోషిస్తున్నారు. మద్యం దుకాణాల వేలంలో అవకాశం దక్కని వారంతా బెల్టు దుకాణాల ద్వారా అక్రమంగా అమ్మకాలు జరుపుతూ ప్రజలను నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు. మద్యం బాటిల్ ధరకు 5 నుంచి 10 శాతం మేర అధికంగా ఆపాదించి విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో బెల్టు దుకాణాలన్నీ విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నా.. పోలీసులు, ఆబ్కారీ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరితో పచ్చని పల్లెలన్నీ చీకటిపడితే... మద్యం బాటిళ్లతో సందడిగా మారుతుండడం పలు పేద, మధ్య తరగతి కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నది.

**గత డిసెంబర్ నుంచి 2024 జూన్ ముగింపు వరకు మద్యం అమ్మకాల వివరాలివీ...**

| నెల | లిక్కర్ కేసులు | బీర్ కేసులు | మొత్తం(రూ.కోట్లలో...) |
|---|---|---|---|
| డిసెంబర్ | 2,00,000 | 2,67,000 | 200కోట్లు |
| జనవరి | 1,40,000 | 2,00,000 | 136.27కోట్లు |
| ఫిబ్రవరి | 1,39,000 | 2,27,000 | 139కోట్లు |
| మార్చి | 1,16,000 | 2,72,000 | 131కోట్లు |
| ఏప్రిల్ | 1,35,000 | 2,66,000 | 147కోట్లు |
| మే | 1,49,000 | 2,64,000 | 158కోట్లు |
| జూన్ | 1,32,000 | 3,00,000 | 142కోట్లు |
| మొత్తం | 10,11,000 | 17,96,000 | 1053.27కోట్లు |

# నూతన చట్టాల అమలుపై అభిప్రాయ సేకరణ

**డీఐజీ రాజశేఖర్ విస్తృత పర్యటన**

వినాయక్‌నగర్, జూలై 8: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నేర న్యాయ చట్టాల అమలుతీరును పరిశీలించేందుకు బీపీఆర్‌డీ, ఎన్‌సీఆర్‌బీ, సీడీఐటీ, ఐబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ డీఐజీ రాజశేఖర్ సోమవారం జిల్లాలో పర్యటించారు. కమిషనరేట్‌లో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్‌తో కలిసి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధీనియం చట్టాల అమలు తీరుపై వివిధ శాఖల అధికారులతో చర్చించి, వారి సందేహాలు,అభిప్రాయాలను సేకరించారు. అంతకు ముందు జిల్లా న్యాయ అధికారి సునీత కుంచాల, ఇతర న్యాయమూర్తులను కలిసి నూతన కొత్త చట్టాల అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. అనంతరం నిజామాబాద్ ఒకటో టౌన్, డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్లను సందర్శించారు. ఎస్‌హెచ్‌వోలు, ఐటీ కోర్ సిబ్బంది, స్టేషన్ రైటర్స్‌తో మాట్లాడారు. సాయంత్రం కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు అధికారులతో చర్చించారు. నేర న్యాయ చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, న్యాయవాదులు, ప్రభుత్వ దవాఖాన డాక్టర్ల అభిప్రాయాలు సేకరించారు. ఆయన వెంట మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ నుంచి వచ్చిన కుర్ర శ్రీనివాస్, రాజేశ్ కుమార్, సూరేపల్లి శ్రీనివాస్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు రాజా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, బస్వారెడ్డి, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వరరావు, సీసీఆర్‌బీ ఏసీపీ రవీందర్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ రాజశేఖర్, జడ్జి సునీత కుంచాల, పక్కన సీపీ కల్మేశ్వర్ సింగేనవార్

# జేఎల్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్

**ప్రతిభచాటిన కామారెడ్డి జిల్లావాసి**

గాంధారి, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ల పరీక్షా ఫలితాల్లో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నేరల్‌తండాకు చెందిన బర్దావల్ మేఘరాజ్ రాష్ట్రస్థాయి మొదటిర్యాంకు సాధించాడు. హిస్టరీ సబ్జెక్టులో 450 మార్కులకు 367.7 మార్కులు సాధించాడు. మేఘరాజ్ ఇంటర్ వరకు గాంధారిలో చదివాడు. నిజామాబాద్ జీజీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తిచేశాడు. మారుమూల తండాకు చెందిన మేఘరాజ్ జూనియర్ లెక్చరర్ పరీక్షా ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించడంతో తండావాసులతోపాటు పలువురు అభినందించారు.


మేఘరాజ్

# లంచం ఇవ్వలేక ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డి రూరల్, జూలై 8: వుడ్ కార్వింగ్ కోసం తీసుకువచ్చిన చెక్కముక్కలు, బైక్‌ను స్వాధీనం చేసుకోవడంతో ఓ వ్యక్తి అటవీశాఖ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఎల్లారెడ్డిలో సోమవారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండలం గండివేట్ గ్రామానికి చెందిన నామాల శోభన్ తన గుడిసెకు ఉన్న పాత టేకు గుంజను కట్ చేసి 3ఫీట్ల ముక్కలు రెండు, 1ఫీట్ ముక్కలు రెండు తయారు చేసి కార్వింగ్ కోసం ఎల్లారెడ్డి పట్టణంలోని సెంటర్‌కు తీసుకువచ్చాడు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సెక్యూరిటీ గార్డు వాటిని పట్టుకొని ఫారెస్ట్ ఆఫీసుకు తీసుకువెళ్తుండగా, అవి కొత్త టేకు చెక్కలు కావు, పాతవి అని శోభన్ చెప్పినా వినలేదు. రూ.20వేలు ఇస్తే విడిచిపెడతానని డిమాండ్ చేయగా.. అంత ఇచ్చుకోలేనని, రెండు వేలు ఇస్తానని మొరపెట్టుకున్నాడు. డీఆర్వో గులాం యజ్దానీకి సమాచారం అందించగా చెక్క ముక్కలు, బైక్‌ను తీసుకువచ్చి ఫారెస్ట్ కార్యాలయంలో ఉంచాడు. అక్కడ కూడా అవి పాత చెక్కలేనని, నా బైక్‌ను నాకు ఇవ్వండని మొరపెట్టుకున్నా అధికారులు స్పందించలేదు. విసుగుచెందిన శోభన్ సాయంత్రం 6గంటల సమయంలో అటవీశాఖ కార్యాలయం ఎదుట పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మాహత్యాయత్నం చేశాడు. ఈ విషయమై ఎఫ్ఆర్వో ఓంకార్‌ను వివరణ అడుగగా తాను ఇప్పుడే వచ్చానని, తనకేం తెలియదని, డీఆర్వో లేడు, వస్తాడు అంటూ దాటవేస్తూ సమాధానం ఇచ్చారు.


ఎల్లారెడ్డి ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా పెట్రోల్ పోసుకొని ఆత్మాహత్యాయత్నం చేస్తున్న నామాల శోభన్